సాక్షి ప్రకాశం

శుక్రవారం । 18 । జూలై । 2025



ధరపై దిగాలు.. రైతుల గగ్గోలు

పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పాటు వేలం కేంద్రాల్లో బేళ్ల తిరస్కరణతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 8లో..



ఇంజక్షన్ వికటించి ఇన్‌ఫెక్షన్

జీసీ హాస్టల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థికి తోటి విద్యార్థి వేసిన ఇంజక్షన్ వికటించింది. ఇన్‌ఫెక్షన్ రావడంతో వైద్యశాలకు తరలించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

మూడో రోజు ఒక కేంద్రంలోనే ఏపీపీఎస్సీ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఓ చినఓబులేసు

ఒంగోలు సబర్బన్: లెక్చరర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జిల్లాలో పటిష్ట భద్రత మధ్య పరీక్షలు జరుగుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు తెలిపారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జిల్లావ్యాప్తంగా ఆరు సెంటర్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మూడో రోజైన గురువారం ఒంగోలు నగరం మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కాలేజీలో మాత్రమే పరీక్షలు జరిగాయన్నారు. పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీఆర్వో.. అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఉదయం పరీక్షకు 49 మందికిగానూ 29 మంది, మధ్యాహ్నం పరీక్షకు 77 మందికిగానూ 35 మంది హాజరయ్యారని డీఆర్‌ఓ వివరించారు.


డీఈఈ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఒంగోలు సిటీ: డీఈఈ సెట్ కౌన్సెలింగ్‌ను ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ, మైనంపాడులో ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన మేరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలకు రెండు టీంలు ఏర్పాటు చేశారు. ఆయా టీంల ద్వారా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫై చేశారు. ప్రొవిజినల్ అడ్మిషన్ లెటర్‌తో వచ్చిన అభ్యర్థికి అన్ని సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాత ఫైనల్ అడ్మిషన్ లెటర్ ఇవ్వడం జరుగుతుందని సుబ్బారావు తెలిపారు. జిల్లాలో డైట్‌తో పాటు దర్శి, కనిగిరి రెండు ప్రైవేట్ డైట్ కళాశాలలకు మైనంపాడు డైట్‌లోనే వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనుండగా, తొలిరోజు నలుగురు అభ్యర్థులకు సీట్లు కేటాయించారు.

మందుబిళ్ల.. జేబు గుల్ల!

మెడికల్ షాపుల్లో జనరిక్ మాయాజాలం

తక్కువ ధరకు విక్రయించాల్సిన జనరిక్ మందులను ఎమ్మార్పీ రేట్లకే విక్రయిస్తూ ప్రజలను దోచేస్తున్నారు. 80 శాతం తక్కువకు అందించాల్సిన వీటిని ఎమ్మార్పీ రేట్లకు అమ్ముతూ జనం జేబులు గుల్ల చేస్తున్నారు. ఏది జనరిక్ మందో తెలియక మందుల దుకాణాల మాయాజాలంతో ప్రజలు మోసపోతున్నారు. గుర్తింపునిచ్చిన జనరిక్ దుకాణాల్లో రూ.30కి విక్రయించే మందును పెద్ద పెద్ద మెడికల్ షాపుల్లో రూ.150కి విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఔషధ దుకాణాల్లో అడ్డగోలు దోపిడీని అరికట్టాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




- నిరుపేద, సామాన్య ప్రజల జేబులు గుల్ల చేస్తున్న వైనం
- జిల్లాలో 88 జనరిక్ మందుల దుకాణాలు
- ఒక్క ఒంగోలు నగరంలోనే ఏడాదికి రూ.100 కోట్ల వ్యాపారం
- 20 శాతం రాయితీ పేరుతో మెడికల్ షాపుల దోపిడీ
- ఆరోగ్య శ్రీ రోగులకు జనరిక్ మందులు కట్టబెడుతున్న కార్పొరేట్ ఆస్పత్రులు
- ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఇదే తంతు
- ఔషధ నియంత్రణ శాఖనే నియంత్రిస్తున్న మెడికల్ వ్యాపారులు
- బదిలీపై వెళ్లిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు భారీ నజరానా

ఒంగోలు టౌన్:

జిల్లా కేంద్రమైన ఒంగోలులో జనరిక్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఔషధ నియంత్రణ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 88 జనరిక్ మెడికల్ షాపులు ఉన్నాయి. ఇందులో 34 హోల్‌సేల్ దుకాణాలుండగా 54 రిటైల్ దుకాణాలున్నాయి. ఒక్క ఒంగోలు నగరంలోనే 21 జనరిక్ హోల్‌సేల్ దుకాణాలున్నాయి. మార్కాపురంలో 13 జనరిక్ హోల్సేల్ దుకాణాలున్నాయి. నగరంలోని దిబ్బల రోడ్డులోని ఓ షాపులో ఏడాదికి 50 కోట్ల రూపాయలకుపైగానే బిజినెస్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతిరోజూ ఈ హోల్‌సేల్ షాపునకు కనీసం 5 నుంచి 10 లారీల సరుకు వస్తుందని, అంతే మొత్తంలో ఇక్కడి నుంచి సరుకు బయటకు వెళ్తోందని సమాచారం. ఒంగోలు నగరంలోనే ఏడాదికి రూ.100 కోట్ల జనరిక్ మెడిసిన్ వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

20 శాతం రాయితీ ఒట్టిమాయ...

జిల్లా కేంద్రమైన ఒంగోలులో 530 మెడికల్ షాపులు ఉన్నాయి. సుమారు 250కిపైగా హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. కొన్ని మెడికల్ షాపులలో 20 శాతం రాయితీ ఇస్తుంటారు. సహజంగా మెడికల్ షాపుల్లో వినియోగదారులు ఎవ్వరూ బేరాలు చేయరు. అలాంటిది ఏకంగా 20 శాతం రాయితీతో మందులు విక్రయిస్తుండడంతో ప్రజలు ఆయా మెడికల్ షాపులకు క్యూ కడుతున్నారు. వాస్తవానికి ఈ 20 శాతం రాయితీ పెద్ద మాయ అని కొందరు ఫార్మాసిస్టులు చెబుతున్నారు. 20 శాతం రాయితీ పేరుతో మందులు విక్రయిస్తున్న చైన్ మెడికల్ షాపులలో 75 శాతానికి పైగా జనరిక్ మందులను అమ్ముతున్నట్లు సమాచారం. నిజానికి జనరిక్ మందులను వాటిపై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే 80 శాతం తక్కువకు విక్రయించాల్సి ఉంటుంది. బయట మార్కెట్లో జనరిక్ మెడికల్ షాపులలో అలాగే తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు కూడా. కానీ, అందుకు భిన్నంగా కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతూ రెండు చేతులా సంపాదిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనరిక్ మందులను బ్రాండెడ్ పేరుతో విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.



గ్యాస్ట్రిక్ ట్రబుల్ ట్యాబ్లెట్ ఎమ్మార్పీ రూ.175 జనరిక్ దుకాణాలలో రూ.30

ఆరోగ్య శ్రీ రోగులకు జనరిక్ మందులు...

నగరంలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నారు. ఎక్కువగా గుండె జబ్బులు, పక్షవాతం వంటి జబ్బులకు వైద్య సేవలు అందిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో జనరిక్ మందులిచ్చి ఎమ్మార్పీకి బిల్లులు చేసుకుంటున్నట్లు సమాచారం. గుండె జబ్బుతో బాధపడుతున్న వ్యక్తికి గుండె కవాటాల్లో రక్తం గడ్డకట్టకుండా టికాగ్రేలార్ 90 ఎంజీ మందును డాక్టర్ రాశారు. దానిమీద ఎమ్మార్పీ రూ.359 రూపాయలు ఉంది. నిజానికి ఇది జనరిక్ ఔషధం. బహిరంగ మార్కెట్లో దీన్ని కేవలం 60 నుంచి 75 రూపాయలకు మాత్రమే విక్రయించాలి. కానీ, సదరు కార్పొరేట్ ఆస్పత్రిలో దీనికి ఎమ్మార్పీ బిల్లు ఇవ్వడం గమనార్హం. అలాగే కొలెస్టరాల్‌ను నియంత్రించే రోసువాస్టాటిన్ 40 ఎంజీ మందుపై ఎమ్మార్పీ రూ.584 ఉంది. దీనిని కూడా ఎమ్మార్పీకే ఇస్తున్నారు. నిజానికి ఈ మందు జనరిక్ మెడికల్ షాపులలో కేవలం రూ.80కే లభిస్తుంది. లివోసిట్రిజన్ ట్యాబెట్ల మీద ఎమ్మార్పీ రూ.99.55 ఉండగా, ఇది జనరిక్ మెడికల్ షాపులో కేవలం రూ.6కే లభిస్తుంది. ఇదే పెద్ద మెడికల్ షాపులలో ఎమ్మార్పీ మీద 20 శాతం ఇచ్చి రోగుల చెవిలో పూలు పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. గ్యాస్ ట్రబుల్‌కు వాడే ర్యాబిప్రజోల్, పాంటా ప్రజోల్ ట్యాబ్లెట్ల మీద కూడా ఇదే తరహాలో బాదేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణ శాఖ, ఆరోగ్యశ్రీ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక్కొక్క షీటు మీద పదింతలు అధిక రేటుకు విక్రయిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గుండె కవాటాల్లో రక్తం గడ్డకట్టకుండా ఇచ్చే టాబ్లెట్ ఎంఆర్పీ రూ.359 జనరిక్ షాపుల్లో రూ.75

ప్రైవేటు వైద్యశాలల్లో జనరిక్, శాంపిల్స్ మందుల జోరు...

నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో బ్రాండెడ్ మందులు విక్రయిస్తున్న దాఖలాలు కనిపించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ డాక్టర్ మందులు రాశాడంటే బయట ఎక్కడా దొరకవని తరచూ రోగులు చెబుతుంటారు. అవన్నీ థర్డ్ పార్టీ మందులని పాపం రోగులకు తెలియదు. అతి తక్కువ ధరలకు మందులు కొనుగోలు చేసి పదింతల రెట్టింపు ధరలకు విక్రయిస్తూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని రాజాపానగల్ రోడ్డులోని ఒక సర్జన్ దగ్గర యాంటీబయాటిక్ ఇంజక్షన్లలో గోల్‌మాల్ జరుగుతున్నట్లు సమాచారం. జనరిక్ మెడికల్ షాపుల్లో రూ.50కి విక్రయించే యాంటీబయాటిక్ ఇంజక్షన్లను ఈయన ఆస్పత్రిలో రూ.280కి రోగులకు అంటగడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 60 అడుగుల రోడ్డులో ఎప్పుడూ బిజీగా ఉండే చర్మవ్యాధుల డాక్టర్ ఒకరు నాసిరకం మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఎప్పుడైనా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే చాలు.. వెంటనే ఆయన ఆస్పత్రి మూసేసి వెళ్తుంటారని రోగులు చెప్పుకుంటున్నారు. దాదాపుగా అన్ని ఆస్పత్రుల్లోనూ ఇదే దందా కొనసాగుతోందని సమాచారం. ఇటీవల ఇక్కడి నుంచి బదిలీ అయిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు గుంటూరు రోడ్డులోని ఒక ఫంక్షన్ హాలులో అట్టహాసంగా ఆత్మీయ వీడుకోలు సభ నిర్వహించారు. ఆ సందర్భంగా నగరంలోని హోల్‌సేల్ మెడికల్ వ్యాపారులు ఇన్నాళ్లు తమకు సహకరించినందుకు సదరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు భారీ బహుమానం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం :

నేషనల్ ఫార్మాస్యూటికల్స్ ప్రయిసింగ్ అథారిటీ ఔషధ ధరలను నిర్ణయిస్తుంది. ఏ రకం ఔషధాలైనా ఎమ్మార్పీకి మించి విక్రయించకూడదు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఔషధాల నాణ్యతా ప్రమాణాలను ప్రతి నెలా పరిశీలించడం జరుగుతుంది. మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. క్వాలిఫైడ్ వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదు.

వీఎస్ జ్యోతి, ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

దర్శిలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలకు అడ్డంకులు
- కళ్యాణ మండపం ఇవ్వకుండా అడ్డంకులు
- హడావుడిగా 30 యాక్ట్ అమలులోకి తెచ్చిన పోలీసులు
- పోలీసులు, అధికారుల తీరుపై మండిపడుతున్న జనం

దర్శి: దర్శి నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అధికారులు దగ్గరుండి అమలు చేస్తున్నారు. అధికార టీడీపీ నాయకుల ఒత్తిడితో వైఎస్సార్ సీపీ చేపడుతున్న కార్యక్రమాలకు ఆటంకాలు కలిగిస్తున్నారు. సూపర్ సిక్స్ అంటూ అమలు సాధ్యంకాని హామీలిచ్చి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఏడాది కాలంగా చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైంది. దీనిపై వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, దర్శిలో మాత్రం అధికారాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ నాయకులు ఈ కార్యక్రమానికి అడ్డంకులు సృష్టిస్తున్నారు.

ఫంక్షన్ హాళ్లు ఇవ్వొద్దంటూ ఒత్తిళ్లు...

టీడీపీ మాజీ ఎంపీపీ పూసల సంజీవయ్యకు చెందిన పీటీఎస్ కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. దీంతో టీడీపీ నాయకులు రెవెన్యూ, ఇతర అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి దాన్ని వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో ఎక్కడా సమావేశపు హాలు ఇవ్వకపోవడంతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఇంటి వద్దే విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరయ్యే నాయకులకు అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కూడా పట్టణంలో ఎక్కడా కట్టేందుకు వీల్లేదని అధికారులు హుకుం జారీ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్‌పై నియోజకవర్గ ఇన్‌చార్జి ఒత్తిడి తీసుకొచ్చారని ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ సెంటర్‌లో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఊడదీస్తుండగా అక్కడి వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఎక్కువవడంతో వైఎస్సార్ సీపీ నేతలు ఎక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారోనని భయపడి టీడీపీ నేతలు గురువారం గడియారం స్తంభం సెంటర్‌లో కాపలాలు ఉండి మరీ ఫ్లెక్సీలు కట్టనీయకపోవడం గమనార్హం. వైఎస్సార్ సీపీ నాయకులు సమన్వయంతో వివాదాలకు పోకుండా కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు.

హడావుడిగా 30 యాక్ట్...

దర్శి సబ్ డివిజన్ పరిధిలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, త్రిపురాంతకం, కురిచేడు, దొనకొండ, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో 30 యాక్ట్ అమలులో ఉందని దర్శి డీఎస్పీ హడావుడిగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఇది అమలులో ఉంటుందంటూ వైఎస్సార్ సీపీ సమావేశానికి ముందురోజే డీఎస్పీ ప్రకటన ఇవ్వడం గమనార్హం. ముందస్తు అనుమతి లేకుండా ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు చేపట్టరాదన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. హడావుడిగా దర్శి డీఎస్పీ విడుదల చేసిన ప్రకటనపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్నాళ్లూ లేనిది శుక్రవారం పట్టణంలో వైఎస్సార్ సీపీ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఇలాంటి హెచ్చరికలు జారీ చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.

వీరయ్య హత్య కేసులో
నిందితులకు బెయిల్

ఒంగోలు టౌన్:

టీడీపీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసులో ఇద్దరు నిందితులకు బెయిల్ మంజూరైంది. ప్రధాన సూత్రధారిగా పోలీసులు పేర్కొన్న వీరగంధం దేవేంద్ర చౌదరి, మార్టూరి కిరణ్ కుమార్‌కు గురువారం బెయిల్ మంజూరైంది. దేవేంద్ర చౌదరి నాగులప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు చెందినవాడు కాగా, మార్టూరి కిరణ్ కుమార్ అలియాస్ కిరణ్ ఒంగోలులోని అగ్రహారం గేటు దగ్గర బాలాజీనగర్‌కు చెందినవాడు. ఏప్రిల్ 22వ తేదీ ఒంగోలులోని శశికళ ఏజెన్సీ బిల్డింగ్‌లో గల రెండో అంతస్తులోని తన కార్యాలయంలో కూర్చుని మద్యం షాపు లెక్కలు చూస్తుండగా, నలుగురు వ్యక్తులు లోపలకు ప్రవేశించి వీరయ్య చౌదరిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు.. మే 14వ తేదీ 9 మందిని అరెస్టు చేశారు. కొద్దిరోజుల్లోనే మరో ఇద్దరిని అరెస్టు చేయగా ప్రధాన సూత్రధారిగా పోలీసులు భావిస్తున్న ముప్పా సురేష్ పరారీలో ఉన్నారు. అప్పటి నుంచి ఆయన ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల క్రితమే హైకోర్టు ఆయన బెయిల్‌ను తిరస్కరించింది. ఇదిలా ఉండగా, 63 రోజుల తర్వాత దేవేంద్ర చౌదరికి బెయిల్ లభించడం గమనార్హం. దీంతో పోలీసులు అమ్మనబ్రోలులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

వెలిగొండను నిర్వీర్యం చేస్తున్న కూటమి

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని కూటమి సర్కార్ వెలిగొండ ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల మండిపడ్డారు. మేక్ ఆంధ్ర గ్రేట్ ఎగైన్ విత్ జగనన్న కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దదోర్నాల మండలంలో ఆమె పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత వాసుల కడగండ్లను గమనించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంత ప్రజల కష్టాలు గట్టెక్కాలన్న ఉద్దేశంతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. ఆసియా ఖండంలోనే మొట్టమొదటిసారిగా అతి పొడవైన సొరంగాల నిర్మాణాలతో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారన్నారు. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 4 లక్షల 47 వేల 300 ఎకరాలకు సాగు నీరు, ఆయా జిల్లాల పరిధిలోని 30 మండలాల్లో లక్షలాది మందికి తాగునీరు అందించేలా ప్రాజెక్టు రూపుదిద్దుకుందన్నారు. ప్రాజెక్టులో భాగంగా సుంకేసుల నుంచి తీగలేరు కెనాల్‌కు నీరు తరలించడం ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 62 వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. పనులు కూడా నత్తనడకన జరుగుతుండటంతో పనులు చేసే సిబ్బందిని సైతం ఇక్కడి నుంచి పంపించే చర్యలు జరుగుతున్నాయని అన్నారు. ఇంత ప్రాముఖ్యత ఉన్న ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం వీడి ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ఆమె కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆమె ఆకాంక్షించారు.



వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల

సూపర్ స్పెషాలిటీ పూర్తయితే గిరిజనులకు మెరుగైన వైద్యం...

చెంచు గిరిజనుల అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చిన్న రోగాలకే ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనుల కోసం నాటి జగన్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వారి కోసం మండల కేంద్రంలోని ఐనముక్కల వద్ద 50 కోట్ల రూపాయలతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాజకీయాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం వైద్యశాల పనులను వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు గిరిజనుల కోసం యర్రగొండపాలెంలో రూ.26 కోట్లతో 100 పడకల వైద్యశాల, పెద్దదోర్నాలలో రూ.3 కోట్లతో మాతాశిశు ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు జరిగాయన్నారు. దీని వలన నల్లమల పరిధిలోని చెంచు గిరిజనులకు మెరుగైన వైద్యం అందబోతోందని ఆమె అన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అటవీ హక్కుల చట్టం ఏర్పాటు చేసి గిరిజనులు సాగు చేసుకునే భూములపై వారికే హక్కు కల్పించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెద్దదోర్నాల మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, మండల నాయకులు లాలూనాయక్, యక్కంటి లింగారెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, నియోజకవర్గ నాయకులు షేక్ షెక్షావలి, మాండ్ల వెంకటేశ్వర్లు, అల్లు రాంభూపాల్‌రెడ్డి, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, షేక్ జబ్బార్, అల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లేశ్వరి, దొందేటి కృష్ణారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాబు మోసాలు ఎండగడదాం

- వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం:

రాష్ట్ర ప్రజలకు కూటమి నాయకులు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని, చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాన్ని ఎండగట్టాల్సిన సమయం వచ్చిందని వై.పాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన కూటమి నాయకులు ఒక బాండు చేతులో పెట్టి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని ప్రచారం చేశారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి పెద్దమనుషులు.. 15 నెలలు కావస్తున్నప్పటికీ ఆ పథకాలు అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి సామాన్యుడి నడ్డివిరిగే విధంగా పెంచారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని, దీనివలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పేదలకు ప్రభుత్వ పరంగా దక్కాల్సిన లబ్ధి ఏ మాత్రం అందడం లేదని అన్నారు. ఎక్కడ పడితే అక్కడ దాడులు, భూ కబ్జాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెచ్చరిల్లిపోతున్నాయని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఇదేమిటని ప్రశ్నించిన వారిపై పోలీసులతో తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

19న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం...

కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిలదీసి బాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలిపేందుకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 19న త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తాటిపర్తి తెలిపారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని అన్నారు. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ కార్యక్రమానికి వివిధ విభాగాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు అన్ని గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయ భాస్కర్, వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, షేక్ అబ్దుల్ మజీద్, ఉడుముల శ్రీనివాసరెడ్డి, గంటా రమణారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, కె.ఓబులరెడ్డి, గుమ్మా ఎల్లేష్ యాదవ్, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, సూరె రమేష్, ఆర్.అరుణాబాయి, ఉడుముల అరుణ, పల్లె సరళ, పి.కృష్ణారెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్, శేషశయనారెడ్డి, ఎ.ఆదినారాయణ, రంగబాబు, జానకి రఘు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఒంగోలు సిటీ : ఒంగోలు మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల దుకాణాలను గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. మంగళగిరి ఏడీఏటీ శ్రీనివాసరావు, నెల్లూరు విజిలెన్స్ సీఐ ఎస్‌కే సుభాని తనిఖీలు చేశారు. తనిఖీల్లో సరైన పత్రాలు చూపించకపోవడంతో బాలాజీ ఏజెన్సీస్‌లో రూ. 54 లక్షల విలువైన పురుగుమందులు, శాంతి సీడ్స్‌లో రూ.2.80 లక్షల విలువైన విత్తనాలు సీజ్ చేశారు. తనిఖీల్లో ఒంగోలు మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌బాబు, టెక్నికల్ ఏఓ పి.వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

లారీ బోల్తా..

- ముగ్గురికి గాయాలు



కొమరోలు: ఎదురుగా వస్తున్న మహిళను తప్పించబోయి లారీ బోల్తాపడింది. ఈ సంఘటన మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలోని క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రామారావు, రమేష్, సల్మాన్‌రాజు ఎద్దుల జతను లారీలో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరుకు తీసుకువెళుతుండగా నల్లగుంట్ల గ్రామానికి చెందిన మహిళ అడ్డురావడంతో లారీ అదుపుతప్పి రహదారి పక్కన బోల్తాపడింది. ప్రమాదంలో రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా సల్మాన్‌రాజు, రామారావుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

జీతం ఇవ్వలేదని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం



క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

చీమకుర్తి రూరల్: జీతం ఇవ్వడం లేదని పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ సంఘటన మండలంలోని హంస క్వారీలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..క్వారీలో బస్సు డ్రైవర్‌గా సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి పని చేస్తున్నాడు. క్వారీ యాజమాన్యం కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో కార్మికులంతా మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుతున్న సమయంలో సుబ్రహ్మణ్యం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించగా..అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ఆస్తి వివాదంలో పిన్ని, పినతండ్రిపై దాడి



గాయపడిన రమణారెడ్డి, వెంకటసుబ్బమ్మ

గిద్దలూరు రూరల్: ఆస్తి విషయంలో కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి పిన్ని, పినతండ్రిని అంతమొందించేందుకు దాడికి తెగబడ్డాడు. ఈ ఘటన గిద్దలూరు మండలంలోని పొదలకుంటపల్లె గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శనివారపు రమణారెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో రమణారెడ్డి అన్న కుమారుడు నిరంజన్‌రెడ్డి ఇనుప రాడ్‌తో వారి తలపై బలంగా మోదాడు. తలకు తీవ్రగాయలపాలైన వారి కేకలకు స్థానికులు నిద్రలేచే సరికి నిరంజన్‌రెడ్డి అక్కడ నుంచి పారిపోయాడు. గాయపడిన దంపతులను స్థానికులు 108 అంబులెన్స్‌లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బాధితుల కుమారుడు సాయికుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

ధరపై దిగాలు.. రైతుల గగ్గోలు

పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడి చేతికిరాక నష్టాలపాలు

- కంభం మండలం జంగంగుంట్లలో సుమారు వెయ్యి ఎకరాల్లో పొగాకు సాగు
- గ్రామంలో 100 బ్యారన్‌లు, 400 మందికి పైగా పొగాకు రైతులు
- గత ప్రభుత్వ హయాంలో అన్ని గ్రేడ్ల పొగాకు కొనుగోలు
- నేడు సగానికి పైగా బేళ్లను తిరస్కరిస్తున్న వ్యాపారులు
- ఇంటి వద్ద నిల్వ ఉంచితే నాణ్యత తగ్గిపోతోందని రైతుల ఆవేదన



రైతు ఇంట్లో నిల్వ ఉంచిన పొగాకు



నిల్వ ఉన్న పొగాకు ను చూపిస్తున్న జంగంగుంట్ల రైతులు

కంభం:

పొగాకు రైతులను కష్టాలు, నష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో పొగాకు అధికంగా పండించే గ్రామాల్లో ఒకటిగా ఉన్న కంభం మండలం జంగంగుంట్లలో రైతులు ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గ్రామంలో రైతులు 50 ఏళ్లకు పైగా వంశపారపర్యంగా పొగాకు సాగు చేస్తున్నారు. ఇక్కడ నీటి సౌకర్యం తక్కువ ఉండటం, బోర్లు వేసినా నీరు పడక పోవడంతో వాణిజ్య పంట పొగాకు వైపు మొగ్గుచూపారు. సుమారు 400 మంది రైతులు వెయ్యి ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పొగాకు సాగు చేస్తున్నారు. గ్రామంలో సుమారు 100 వరకు బ్యారన్‌లు ఉన్నాయి. జంగంగుంట్లతో పాటు పరిసర గ్రామాల్లోనూ సుమారు 1500 ఎకరాల వరకు పొగాకు సాగు చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారడం, గిట్టుబాటు ధర కల్పించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల సిండికేట్‌తో నష్టం

వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొన్ని బేళ్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, తిరస్కరించిన బేళ్లను ఇళ్లలో నిల్వ ఉంచుకోవాలంటే ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. ఎండకు, వానకు పొగాకు నాణ్యత తగ్గిపోతుండటంతో మళ్లీ గ్రేడింగ్ చేసుకోవడం అదనపు భారంగా మారుతోందని చెబుతున్నారు. గతంలో నోబిడ్ అయిన, తిరస్కరించిన బేళ్లను అక్కడే గోడౌన్‌లో పెట్టుకునేవారు. ప్రస్తుతం పొగాకు ఎక్కువగా ఉందని అధికారులు నిరాకరిస్తుండటంతో తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక రైతులు నానాతిప్పలు పడుతున్నారు.

వైఎస్సార్, జగన్ హయాంలోనే లబ్ధి

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్‌టీసీ ద్వారా రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయించడమే కాకుండా ఎఫ్–8, ఎఫ్–9 రకం రైతులకు క్వింటాకు రూ.2 వేల చొప్పున డబ్బు ఇచ్చి నాడు ప్రభుత్వం ద్వారా ఆదుకున్నారన్నారని జంగంగుంట్ల రైతులు గుర్తుచేసుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించడంతో లాభపడ్డామని, గడిచిన నాలుగేళ్లలో ఎఫ్–1 నుంచి ఎఫ్–4 రకం వరకు క్వింటా రూ.36 వేల వరకు ధర పలకగా, మిగిలిన రకాలకు రూ.30 వేల వరకు ధర లభించిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎఫ్1, ఎఫ్2, ఎఫ్3 రకాలు రూ.28 వేలు ఉండగా ఎఫ్4 రూ.18 వేలు పలుకుతోందని, లోగ్రేడ్ రకం, పచ్చాకును అసలు కొనడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అన్ని రకాల పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో పొగాకు రైతులకు ఏనాడూ నష్టాలు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పొగాకు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. గిట్టుబాటు ధరలు కల్పించి, అన్ని రకాల గ్రేడ్ల పొగాకును కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుని, పొగాకు రైతులను ఆదుకోవాలి.

– గొంగటి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కంభం

నష్టాలే మిగిలాయి



ఏటా 50–60 ఎకరాల్లో పొగాకు పండిస్తా. గత ప్రభుత్వ హయాంలో ధరలు బాగుండటంతో పెట్టుబడిపోను లాభాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిట్టుబాటు ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

– గొంగటి రామిరెడ్డి, పొగాకు రైతు

సగానికి పైగా పొగాకు ఇంట్లోనే ఉంది



20 ఎకరాల్లో పొగాకు వేశాను. సుమారు రూ.20 లక్షల వరకు పెట్టుబడి ఖర్చులయ్యాయి. సగానికి పైగా పొగాకు ఇంట్లోనే నిల్వ ఉండి పోయింది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అన్ని గ్రేడ్ల పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– కొప్పురపు గురువారెడ్డి, పొగాకు రైతు

పెట్టుబడి కూడా చేతికి రావడం లేదు



9 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. సుమారు 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పది క్వింటాళ్ల పొగాకు మాత్రమే ఇప్పటి వరకు అమ్ముకోగలిగా. మిగిలిన పొగాకు ఇంటి వద్ద నిల్వ ఉంది. ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం చూస్తే పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదు.

– పాలగిరి నారాయణరెడ్డి, పొగాకు రైతు

కూటమి పాలనలో అభివృద్ధి తిరోగమనం

- మార్కాపురం మెడికల్ కాలేజీ పనులు నిలిపేయడం దుర్మార్గం
- జల్‌జీవన్ మిషన్ పనుల మంజూరుపై పవన్‌కల్యాణ్ డబ్బా
- పొదిలి చెరువును డంపింగ్ యార్డుగా మార్చిన ఘటన కూటమి సర్కారుదే..
- ప్రజల హృదయాల్లో వైఎస్సార్ కుటుంబానికి సుస్థిర స్థానం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల



ఇంటెక్ వెల్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల

మార్కాపురం/పొదిలి రూరల్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు, విద్యాభివృద్ధికి, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే తుంగలోకి తొక్కిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల విమర్శించారు. గురువారం ఆమె మార్కాపురం మండలం గొట్టిపడియ వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటెక్ వెల్, రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కూటమి పాలనలో అభివృద్ధి పనులను గాలికొదిలేసిన తీరును ఎండగట్టారు. పశ్చిమ ప్రకాశం వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.75 కోట్లతో ఇన్‌టెక్ వెల్ నిర్మాణాన్ని ప్రారంభించడమే కాకుండా జల్ జీవన్ మిషన్ కింద రూ.1270 కోట్లు ఖర్చు చేసే పథకానికి ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. ఎన్నికల్ కోడ్ అమలయ్యే నాటికి ఇంటెక్ పనులు 75 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ఈనెల 4వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మార్కాపురంలో జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తూ తామే నిధులు తీసుకొచ్చినట్లు గొప్పలు చెప్పడాన్ని తప్పుబట్టారు. వెలిగొండ ప్రాజెక్టును 2004లో జలయజ్ఞంలో భాగంగా దివంగత సీఎం వైఎస్సార్ ప్రారంభించగా, ఆయన తనయుడు వైఎస్ జగన్ టన్నెల్స్ నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు.

ప్రభుత్వమే మెడికల్ కాలేజీ నిర్వహించాలి

మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు 70 శాతానికిపైగా పూర్తి కాగా కూటమి అధికారం చేపట్టగానే నిలిపేయడంపై శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్య, నాణ్యమైన వైద్యం అందరికీ అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేట్‌కు అప్పగించాలని కూటమి ప్రభుత్వం భావించడం దారుణమన్నారు. మెడికల్ కాలేజీ పనులను వేగంగా పూర్తి చేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ బాటలోనే ఆయన కుమారుడు వైఎస్ జగన్ నడుస్తున్నారని, వారు చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. అనంతరం ఆమె పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబును కలిసి మాట్లాడారు.

చెరువా.. డంపింగ్ యార్డా?

పొదిలి పెద్ద చెరువు పైప్‌లైన్ పనులను శ్యామల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 12వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పెద్ద చెరువు పైపులైన్ పనులను ప్రారంభించారన్నారు. రూ.50.13 కోట్ల వ్యయంతో దర్శి ఎన్ఎస్పీ కాలువ నుంచి పెద్దచెరువుకు సాగర్ నీరు సరఫరా చేసేందుకు భూగర్భ పైపు లైన్ పనులను కూటమి ఏడాదిపాటు నిలిపేయడంతో డంపింగ్ యార్డులా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలను తొలగించినంత మాత్రానా చేసిన మంచిని ప్రజల మది నుంచి చెరిపేయలేరని కూటమి నాయకులకు చురకలంటించారు. అబద్ధాలు చెప్పడం మానుకుని ప్రజలకు అవసరమైన మంచి పనులు చేయాలని హితవు పలికారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలి, గుంటూరి పిచ్చారెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వర్లు, అనుబంధ సంఘాల నాయకులు

144 గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ శివకుమారి

సింగరాయకొండ: అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.2.13 లక్షల విలువైన 144 మద్యం బాటిళ్లు, రెండు మోటారుసైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఘటన గురువారం మండలంలోని పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెం సమీపంలో బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..చినగంజాం మండలం కోడూరివారిపాలెం గ్రామానికి చెందిన ప్రళయకావేరి జయంతి బాబు, పాట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం శ్రీరాంనగర్‌కు చెందిన జాన నాగార్జున, ఊళ్లపాలెం గ్రామానికి చెందిన అరవ పవన్‌లను అదుపులోకి తీసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. గోవా మద్యానికి, రాష్ట్రంలో అమ్మే మద్యానికి రూ.60 నుంచి రూ.120 వరకు వ్యత్యాసం ఉందని, దీంతో గోవా తయారీ మద్యం తీసుకుని వచ్చి అమ్ముతున్నారని, ఆ విధంగా అమ్మడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

సింగరాయకొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గర్భిణి మృతి చెందింది. ఈ ఘటన గురువారం రాత్రి 8 గంటల సమీపంలో జాతీయ రహదారిపై బీకే క్రషర్ కంపెనీ సమీపంలో జరిగింది. హైవే పోలీసుల కథనం ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన వర్ష(22) టంగుటూరు గ్రామానికి చెందిన నాగరాజుతో రెండో వివాహం చేసుకుంది. బీకే క్రషర్ కంపెనీలో పనిచేస్తున్న తన బంధువును కలిసేందుకు వచ్చిన వర్ష...రోడ్డు దాటుతుండగా ఘటన జరిగింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఇంజక్షన్ వికటించి ఇన్ఫెక్షన్



బాధిత విద్యార్థి సతీష్‌ను విచారిస్తున్న ఎస్సై



సతీష్ కుడిచేయి మణికట్టు వద్ద ఇన్‌ఫెక్షన్

- నీరసంగా ఉందన్న విద్యార్థికి డైక్లోఫెనాక్ ఇంజక్షన్ వేసిన స్నేహితుడు
- వారం రోజుల క్రితం కంభంలో ఘటన.. విచారణ చేపట్టిన పోలీసులు

కంభం: ఇంజక్షన్ వికటించి ఓ విద్యార్థికి ఇన్ఫెక్షన్ సోకిన ఘటన కంభం మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. వారం రోజుల క్రితం వేసిన ఇంజక్షన్ వికటించి అనారోగ్యానికి గురైన విద్యార్థిని గురువారం కంభం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని పూసలబజారులో నివాసం ఉంటున్న కె.సతీష్ కుమార్ బీసీ హాస్టల్లో ఉంటూ కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్లిన సతీష్ కుమార్ ఆరోగ్యం బాగాలేదని ఉపాధ్యాయులకు చెప్పడంతో హాస్టల్‌కు పంపించేశారు. ఆ తర్వాత హాస్టల్లో చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. కుమారుడి కుడిచేతి మణికట్టు వద్ద రంధ్రం లాగా ఉండి నల్లగా మారడాన్ని గమనించిన తల్లి.. గురువారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లింది. ఇంజక్షన్ వికటించి ఇన్‌ఫెక్షన్ సోకిందని చెప్పిన వైద్యులు.. ఏం జరిగిందని ఆరా తీశారు. ×వారం రోజుల క్రితం తనకు నీరసంగా ఉందని తరగతి గదిలో పడుకోగా పదో తరగతి ఏ సెక్షన్ విద్యార్థి నితీష్ వచ్చి ఇంజక్షన్ వేసుకుంటే తగ్గిపోతుందని తీసుకెళ్లాడు. చర్చి సమీపంలో ఉన్న క్లినిక్ వద్ద ఇంజక్షన్ వేశాడు≈ అని సతీష్ వివరించాడు. విషయం తెలుసుకున్న కంభం ఎస్సై నరసింహారావు వైద్యశాలకు చేరుకుని బాలుడి వద్ద వివరాలు సేకరించారు. పాఠశాలకు వెళ్లి నితీష్‌ను విచారించగా తానే ఇంజక్షన్ వేసినట్లు ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు. చర్చి సమీపంలో ఉన్న తెలిసిన వారి క్లినిక్‌లో ఇంజక్షన్ తీసుకున్నట్లు చెప్పాడని పోలీసులు వెల్లడించారు. నితీష్ ఖాళీ సమయంలో క్లినిక్ వద్దకు వెళ్లి కూర్చునేవాడని, నీరసంగా ఉందని చెప్పిన సతీష్‌కు డైక్లోఫెనాక్ ఇంజక్షన్ వేస్తే తగ్గిపోతుందని ఊహించుకుని అలా చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, క్లినిక్ నుంచి ఓ బాలుడు ఇంజక్షన్ తీసుకెళ్తున్నా సదరు వైద్యశాల సిబ్బంది పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


నకిలీ ధ్రువీకరణ పత్రాల కేసులో నలుగురు అరెస్టు



నిందితులను చూపుతున్న ఎస్సై మహేంద్ర

జరుగుమల్లి(సింగరాయకొండ): తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, నకిలీ రబ్బరు స్టాంపులు తయారు చేసి ప్రభుత్వం స్థలం కాజేందుకు ప్రయత్నించిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. కేసులో నిందితులైన ఎస్ఎస్ కండ్రిక గ్రామానికి చెందిన చింతగుంట్ల అంకయ్య, పొన్నలూరు మండల కేంద్రానికి చెందిన గొడపేరు రవికుమార్, వలేటివారిపాలెం మండలం కూనిపాలెం గ్రామానికి చెందిన యెండ్లూరి ఇమ్మానియేల్, శాఖవరం గ్రామానికి చెందిన తాటిపర్తి అశోక్‌లను అరెస్టు చేశామన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై వివరాలు వెల్లడించారు. ఎస్ఎస్ కండ్రిక గ్రామంలో 1997లో ప్రభుత్వం ఆ గ్రామానికి చెందిన మల్లయ్య, సుందరరామయ్యలకు చెందిన 1.92 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి అందులో 5 సెంట్ల చొప్పున ప్లాట్లు వేసి 24 మంది మాదిగలకు ఇళ్లు కట్టించి ఉచితంగా ఇచ్చారు. మిగిలిన స్థలాన్ని సామాజిక అవసరాలకు ఉంచారు. గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తుడు చింతగుంట్ల రోశయ్యకు ఎటువంటి స్థలం ఇవ్వలేదు. అయితే రోశయ్య గ్రామ అవసరాలకు ఉంచిన స్థలాన్ని కాజేసే ప్రయత్నంలో తన అన్న కొడుకు అంకయ్యతో కలిసి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించాలని నిర్ణయించి ఇందుకోసం పొన్నలూరు మండల కేంద్రానికి చెందిన రవికుమార్‌తో తప్పుడు ధృవీకరణ పత్రాలు తయారు చేసేందుకు రూ.23 వేలు ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారు. తరువాత రవికుమార్, ఇమ్మానియేల్, అశోక్ ముగ్గురు కలిసి సర్వేనంబరు 97 లోని 286 గజాల స్థలం 15 ఏళ్లుగా రోశయ్య అనుభవంలో ఉన్నట్లు నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించారు. తరువాత ఆ స్థలాన్ని రోశయ్య భార్య కోటమ్మ పేరుపై కందుకూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ స్థల విషయమై మాదిగ కులస్తులు ఒంగోలు మీకోసంలో కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రిజిస్ట్రేషన్ కాగితాలు, రెండు రబ్బరు స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నిరుద్యోగుల గొంతుకోసిన చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి నమ్మించి గొంతుకోశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో గురువారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోజ్జాడ యుగంధర్ అధ్యక్షత వహించగా, ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు సృష్టిస్తానని, లేకపోతే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మొత్తం 143 హామీలిచ్చిన చంద్రబాబు తన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చేస్తానని, వర్క్ ఫ్రం హోం ద్వారా ఇంటి దగ్గర కూర్చుని లక్షలు సంపాదించేలా చేస్తానని చంద్రబాబు మాట్లాడారని చెప్పారు. 5 సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తానని చెప్పారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ ఈ ఏడాదికి రావాల్సిన 4 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని మొసలికన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ఐటీ హబ్‌లు పెడతాను, ఇండస్ట్రియల్ కారిడార్లు పెడతానని ఒట్టి మాటలు చెప్పడం తప్ప ఆచరణలో ఒక్క జిల్లాలో కూడా ఎలాంటి పరిశ్రమలు పెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న పరిస్థితులతో పాటు ఉద్యోగ కల్పనలో ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తూ యువత దగ్గరకు ఏఐవైఎఫ్ వెళ్తోందని చెప్పారు. యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి లేని వారి సంఖ్య 2.50 కోట్లకుపైగానే ఉన్నట్లు స్కిల్ సర్వేలో తేలిందని తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిలో కోటిన్నర మంది ఎలాంటి ఉపాధి లేని వారు ఉన్నారని చెప్పారు. కూటమి పాలనలో యువతకు దక్కిందేమీ లేదన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖలలో సుమారు 3.20 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేసే పరిస్థితి కానరావడం లేదన్నారు. నిరుద్యోగ యువత పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్లు పోతుల ప్రభాకర్, వై.బాబి, కత్తి రవి, షేక్ సుబాని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 21 వరకు తపాలా సేవలు బంద్

ఒంగోలు వన్‌టౌన్/మార్కాపురం: ప్రకాశం తపాలా డివిజన్ పరిధిలో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు సేవలను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు ప్రకాశం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ మొహ్మద్ జాఫర్ సాధిక్, మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ గ్రంధి శ్రీనివాసులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి ప్రకాశం డివిజన్ పరిధిలోని 454 తపాలా కార్యాలయాల్లో 2.0 సాఫ్ట్‌వేర్ వర్షన్‌తో సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. అన్ని రకాల పోస్టల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం డాక్ సేవా యాప్‌ను సిద్ధం చేస్తోందని వెల్లడించారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.